క్లుప్తంగా

కలెక్టర్, ఎస్పీని కలసిన ఐఓసీ డీఎం



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న హరీష్‌కుమార్ రెడ్డి

గుంతకల్లు రూరల్: గుంతకల్లు మండలంలోని నక్కనదొడ్డి సమీపంలో ఉన్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ డిపో సీనియర్ మేనేజర్ హరీష్‌కుమార్ రెడ్డి శుక్రవారం కలెక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ జగదీష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందజేస్తూ నక్కనదొడ్డి పంచాయతీ పరిధిలోని నాలుగు గ్రామాల అభివృద్ధికి ఐఓసీ తీసుకుంటున్న చర్యలను వివరించారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్న ఐఓసీ సీనియర్ డిపో మేనేజర్‌తోపాటు, ఇతర అధికారులు సిబ్బందికి జిల్లా కలెక్టర్, ఎస్పీ అభినందనలు తెలియజేయడంతో పాటు ఐఓసీకి సహాయ సహకారాలు అందిస్తామని వారు తెలిపినట్లు డిపో మేనేజర్ తెలిపారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న సురేష్ తదితరులు

గుంతకల్లుటౌన్: కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చే విధంగా మోదీ సర్కారు తెచ్చిన నూతన లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకూ పోరాడుదామని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) జిల్లా కార్యదర్శి సురేష్ అన్నారు. శుక్రవారం న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మే డేకు సంబంధించిన పోస్టర్లను ఆయన విడుదల చేశారు. గతంలో ఉన్న కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు సర్కారు ఆప్కాస్‌ను రద్దుచేసి ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను దళారీల కబంధ హస్తాల్లో ఇరికించేందుకు ప్రయత్నాలు చేస్తోందన్నారు. మేడేను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ పట్టణ కార్యదర్శి రామాంజినేయులు, నాయకులు రామ్‌దాస్, నారాయణ, విశ్వనాథ్, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

30లోపు ఈ-కేవైసీ చేయించుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి

గుంతకల్లు రూరల్: రేషన్ కార్డు లబ్ధిదారులు ఈ నెల 30లోపు ఈ-కేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ రమాదేవి సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గుంతకల్లు మండలంలో 1,45,936 మంది రేషన్ కార్డు లబ్ధిదారులు ఉండగా 9,440 మంది లబ్ధిదారులు ఈ-కేవైసీ నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు. ఈనెల 30వ తేదీ నాటికి ప్రభుత్వం విధించిన గడువు ముగుస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సంబంధిత డీలర్‌ను కలిసి ఈ-కేవైసీ చేసుకోవాలన్నారు. అలాగే వివిధ కారణాల వల్ల గ్యాస్ సబ్సిడీ నగదు జమ కాని వినియోగదారులు వీఆర్వో చిట్టిబాబు(9966919079)ను సంప్రదిస్తే సమస్య పరిష్కారానికి సూచనలిస్తారన్నారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో సేవలు నమోదు చేయాలి



మాట్లాడుతున్న జిల్లా గణాంక అధికారి మహమ్మద్ రఫి

గుంతకల్లు రూరల్: ప్రభుత్వ ఆస్పత్రులు, సబ్ సెంటర్లలో అందిస్తున్న సేవలను నమోదు చేయాలని జిల్లా గణాంక అధికారి మహమ్మద్ రఫి వైద్యారోగ్యశాఖ సూచించారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సబ్ సెంటర్ల సిబ్బంది ఏఎన్‌ఎంలు, సీహెచ్‌ఓలకు శుక్రవారం గుంతకల్లు పట్టణంలోని తిలక్‌నగర్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గణాంక అధికారితోపాటు డీపీఓ కిశోర్‌కుమార్ మాట్లాడుతూ ఆస్పత్రులో అందుతున్న ఆరోగ్య సేవలు, మాతా శిశు సంరక్షణ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, మాతా శిశు మరణాలు, క్వాలిటీ కంట్రోల్ సేవల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ ప్రతి నెలా ఉన్నతాధికారులకు రిపోర్ట్ అందజేయాలన్నారు. కార్యక్రమంలో గుంతకల్లు డివిజన్ పరిధిలోని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు, ఎంపీహెచ్‌ఈఓలు, ఏఎన్‌ఎంలు, సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

పొలాలకు సంజీవని 'తెల్ల సుద్ద'

- తేమ శాతాన్ని నిల్వ ఉంచడంలో కీలకపాత్ర
- పెరగనున్న పంటల దిగుబడి

పుట్లూరు: పంట పొలాలకు తెల్ల సుద్ద (బెలుకు) సంజీవనిలా పని చేస్తోంది. వర్షాభావ పరిస్థితుల్లో తక్కువ వర్షపాతం నమోదైనప్పటికీ ఎక్కువ రోజులు తేమ శాతాన్ని నిల్వ ఉంచడంలో తెల్ల సుద్ద ప్రయోజనకరంగా ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. మండలంలోని పుట్లూరు, గోపురాజుపల్లి, నాగిరెడ్డిపల్లి, బాలాపురం, కందికాపుల, చింతకుంట, చింతలపల్లి తదితర గ్రామాల్లోని రైతులు వర్షభావ పరిస్థితులను ఎదుర్కోవడానికి నల్లరేగడి భూములకు ఎక్కువగా తెల్ల సుద్దను తరలిస్తారు. పుట్లూరు సమీపంలోని గుట్టలపై విరివిగా లభిస్తోన్న తెల్ల సుద్దను ట్రాక్టర్ల ద్వారా ఎకరాకు 30 ట్రిప్పుల ప్రకారం తరలిస్తున్నారు. ఇందుకోసం రైతులు ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. గతంలో తెల్ల సుద్దను తరలించిన పొలాల్లో వేరుశనగ, పప్పుశనగ తదితర పంటల దిగుబడి ఎక్కువగా ఉన్నట్లు రైతులు తెలిపారు. అలాగే తాడిపత్రి మండలంలోని కొనగుంటపల్లి, దిగువపల్లి, ఎర్రగుంటపల్లిలో రైతులు సైతం పొలాల్లోకి తెల్ల సుద్ద తరలిస్తుంటారు.

రాయితీపై తరలించాలి

తెల్ల సుద్దను రాయితీపై తరలించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. చిన్న, సన్నకారు రైతులు అధిక వ్యయంతో తెల్లసుద్దను తరలించడానికి ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాయితీపై తెల్లసుద్దను తరలిస్తే వర్షాభావ పరిస్థితులలో ప్రయోజనకరంగా ఉంటుందని అన్నదాతలు కోరారు.



పుట్లూరు సమీపంలో నల్లరేగడి భూములకు తెల్ల సుద్ద తరలించిన దృశ్యం

దిగుబడి పెరుగుతుంది



వర్షాలు తక్కువగా కురిసిన సమయంలో పంట దెబ్బతినకుండా తెల్ల సుద్ద వల్ల ప్రయోజనం కలుగుతుంది. తేమశాతం నిల్వ ఉండటంతో పాటు మంచి దిగుబడులు పొందే అవకాశం ఉంటుంది. దీంతో పొలాల్లోకి తెల్ల సుద్ద తరలించడానికి రైతులు మక్కువ చూపుతున్నారు.

– నాగరాజు, రైతు, పుట్లూరు

తేమ నిల్వ ఉంటుంది



రైతులు తెల్ల సుద్ద (బెలుకు)ను పొలాలకు తరలించడం వల్ల తేమశాతం ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు దోహద పడుతుంది. అలాగే దిగుబడి ఆశాజనకంగా ఉంటోంది. ఒక ఏడాది పొలాలకు తరలిస్తే కనీసం నాలుగు సంవత్సరాల వరకూ ప్రయోజనం కలుగుతుంది.

– కాత్యాయని, వ్యవసాయ అధికారి, పుట్లూరు

సాగునీటి కోసం సమైక్య ఉద్యమాలు



మాట్లాడుతున్న జగదీష్

గుంతకల్లు: నియోజకవర్గానికి సాగునీటిని సాధించడానికి రాజకీయాలకు అతీతంగా సమైక్య ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ కోరారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో గుంతకల్లు నియోజకవర్గంలోని వ్యవసాయ భూములకు సాగునీటిని కేటాయించాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి సీపీఐ మండల కార్యదర్శి రాముడు రాయల్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలకు ముఖద్వారమైన గుంతకల్లు నియోజకవర్గానికి హంద్రీనీవా నీటి కేటాయింపులు లేకపోవడం ఎంతవరకూ సబబు అని ప్రశ్నించారు. నియోజకవర్గం అభివృద్ధి చెందడానికి తాడిపత్రి తరహాలో పరిశ్రమలు, కనీసం ఇతర నియోజకవర్గాలకు కేటాయించిన తరహాలో నీటి కేటాయింపులు కూడా లేవన్నారు. ప్రస్తుతం హంద్రీనీవా కాలవ వెడల్పు పనులు జరుగుతున్న తరుణంలో గుంతకల్లు నియోజకవర్గానికి సాగునీటి కోసం పార్టీలు, జెండాలకు అతీతంగా పోరాటాలు చేయాలన్నారు. అలాగే రాగులపాడు లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి పిల్ల కాలవలు ఏర్పాటు చేసి నియోజకవర్గంలోని 17 చెరువులకు సాగునీరు, తాగునీరు ఇవ్వాలన్నారు. ఇందు కోసం అన్ని పార్టీలు, ప్రజాసంఘాల నాయకులతో సాగునీటి పోరాట సమితి ఏర్పాటు చేస్తామన్నారు. వారు గ్రామాల్లో పర్యటించి రైతులను పెద్దఎత్తున సమీకరించి మే చివరిలో 10 వేల మందితో ఉద్యమానికి శ్రీకారం చుట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎండీఆర్ ఖలీల్, రాము, గోవిందునాయక్, రంగనాయకులు, సీపీఐ నాయకులు గోవిందు, వీరభద్రస్వామి, మహేష్, గోపీనాథ్, ఎస్ఎండీ గౌస్, రైతు సంఘం నాయకులు మందాలప్ప, కందుల ప్రసాద్‌రెడ్డి, హనుమనాయక్, ఎమ్మార్పీఎస్ నాయకుడు బాలాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పౌరాణిక నాటక ప్రదర్శన



గజరాంపల్లిలో సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటక ప్రదర్శన దృశ్యం

పామిడి: మండలంలోని గజరాంపల్లి లో తెలుగుభాష సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో స్వరరాగ నాటక కళాసమితి సౌజన్యంతో గురువారం రాత్రి నిర్వహించిన సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. నాటకంలోని నరహరి పాత్రధారి దేవరాజు నటనతో పాటు ప్రతి సన్నివేశం నాటక ప్రియులను రంజింపజేసింది. నాటకంలో స్వరరాగ నాటక కళాసమితి సభ్యులు పుంజా కృష్ణారావు యాదవ్, దేవరాజు, రమణమూర్తి, ఆంథోని, నారాయణరెడ్డి, హనుమంతరెడ్డి, సుధాకర్ రెడ్డి, చితంబరరెడ్డి, అరుణకుమారి, నాగవేణి, మస్తాన్ తదితరులు నటించారు. ఈసందర్భంగా నటకిరీటిలు దేవరాజు, బెస్ట్ సుబ్రమణ్యం తదితరులను గ్రామపెద్దలు ఘనంగా సత్కరించారు.

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి



బీకేఎస్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



యాడికి పీహెచ్‌సీలో ర్యాలీ చేస్తున్న దృశ్యం



యల్లనూరు మండలం తిమ్మంపల్లిలో ర్యాలీ చేస్తున్న వైద్యులు కీర్తన, సిబ్బంది

బుక్కరాయసముద్రం/యాడికి/యల్లనూరు: ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని బీకేఎస్, కొర్రపాడు డాక్టర్లు తెహరున్నీసా, ఇందిరా ప్రియదర్శిని, వినోద్‌కుమార్ సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం బీకేఎస్, కొర్రపాడు వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరి రక్షణపై జాగ్రత్తలు పాటించాలన్నారు. రోజూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వేసవి కాలం నీరు ఎక్కువగా తీసుకోవాలన్నారు. అనంతరం మలేరియా వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓలు మోహన్‌రావు, మోహన్‌బాబు, సూపర్ వైజర్ ఈశ్వరమ్మ, పీహెచ్ఎన్ చెన్నమ్మ, హెల్త్ ఎడుకేటర్ పర్వీన్, హెల్త్ అసిస్టెంట్‌లు నాగరాజు, ఆనంద్, భవాని, గౌతమి, మంజు భార్గవి, యామిని, జ్యోతి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- యాడికి మండల కేంద్రం, మండలంలోని రాయలచెరువు పీహెచ్‌సీల్లో శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని ఆయా పీహెచ్‌సీల వైద్యాధి కారులు పరమేశ్వర్, అప్పయ్య, తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పీహెచ్‌సీ అధికారులు, సిబ్బంది ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. దోమలు ప్రబల కుండా చర్యలు తీసుకోవాలని, దోమల మందు పిచికారీ చేయాలని అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.
- యల్లనూరు మండలంలోని తిమ్మంపల్లి పీహెచ్‌సీలో శుక్రవారం మలేరియా దినోత్సవంపై వైద్యురాలు కీర్తన ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమ కుట్టరాదు...దోమ పుట్టరాదని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణమ్మ, పీహెచ్‌యన్ దీనాకుమారి, సూపర్‌వైజర్ రాము, విజయలక్ష్మి, ఫార్మసిస్టు బాబురావు, ల్యాబ్‌టెక్నీషియన్ హరి, స్టాఫ్‌నర్సు రేష్మ, సుదంర రాజు, బాస్కర్, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వడ్డీ కట్టించుకుని రుణాలు రెన్యువల్ చేయాలి



కెనరా బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

యాడికి: అతివృష్టి, అనావృష్టి కారణాల వల్ల రైతులు నష్టపోయిన నేపథ్యంలో ఖరీఫ్ పంట రుణాలకు సంబంధించి వడ్డీ కట్టించుకొని కొత్త రుణాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు వెంకటరాముడు యాదవ్ కోరారు. శుక్రవారం సీపీఐ నాయకులతో కలసి ఆయన మండలంలోని కెనరా బ్యాంకు మేనేజర్‌తో సమావేశమయ్యారు. మండలంలోని రైతులతో వడ్డీ కట్టించుకుని క్రాప్ లోన్లు రెన్యువల్ చేయాలని, స్కేల్‌ఆఫ్ ఫైనాన్స్ ఎకరానికి రూ.50 వేలు రుణం ఇవ్వాలని ఆయనతోపాటు సీపీఐ మండల కార్యదర్శి జూటూరు మహ్మమ్మద్ రఫి, కార్యదర్శి ఓబిరెడ్డి తదితరులు డిమాండ్ చేశారు. అలాగే రైతులతో గోల్డ్ లోన్లు పూర్తి మొత్తం కట్టించుకోకుండా వడ్డీతో రెన్యువల్ చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వడ్డే రాముడు, చిన్న కుళ్లాయిరెడ్డి, వెంకటస్వామి, ఆంజనేయులు, నరసింహులు, వెంకట రమణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరులో కార్డెన్ సెర్చ్



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో శుక్రవారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా శింగనమల సర్కిల్ సీఐ కౌలుట్లయ్య మాట్లాడుతూ గ్రామంలో అనుమానితులు, రౌడీషీటర్ల ఇళ్ల తనిఖీ చేశామన్నారు. గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా ప్రజలు ప్రశాంత జీవనం సాగించాలన్నారు. అలాగే సైబర్ మోసాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. యువత వ్యసనాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. చిన్న, చిన్న తగాదాలకు ఘర్షణ పడి కేసులు నమోదు చేసుకోరాదన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గార్లదిన్నె, నార్పల ఎస్ఐలు గౌస్‌మహమ్మద్ బాషా, సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం'

పామిడి: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. పామిడిలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజా సమస్యలపై సమీక్షించి వాటి పరిష్కారానికి కృషిచేయడమే ప్రజాదర్బార్ ధ్యేయమన్నారు. ఈ సందర్భంగా ప్రజాదర్బార్‌కు ప్రజలు సమస్యలను ఏకరువు పెట్టారు. మౌళిక వసతులైన సీసీరోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్ సమస్యలతో పాటు పింఛన్ల వర్తింపు కోసం వినతులు వెల్లువెత్తాయి. ఇటీవల పామిడి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ అక్రమ తొలగించారని ప్రిన్సిపాల్ సుభద్రమ్మ ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. ప్రహరీ తొలగింపుదారుడిపై చట్టరీత్యా చర్యలు చేపట్టాలని పోలీసులకు ఎమ్మెల్యే ఆదేశించారు. అలాగే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు, ఎమ్మెల్యే తనయుడు ఈశ్వర్, డాక్టర్ పత్తి హిమబిందు, మండల కూటమి నాయకులు పాల్గొన్నారు.

సజావుగా మండల సమావేశం



మండల సమావేశం నిర్వహించిన దృశ్యం

గార్లదిన్నె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ వెంకటనారాయణ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ శాఖల అధికారులు తమ శాఖల ద్వారా మండలాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి అందిస్తున్న సేవలు గురించి వివరించారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలు అడగడంతో సంబంధిత అధికారులు సమాధానమిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యోగానందరెడ్డి, వైస్ ఎంపీపీ కుంచం రామ్మోహన్ రెడ్డి, సూపరింటెండెంట్ బాబా ప్రక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పుట్లూరు: మండలంలోని కుమ్మనమల గ్రామంలో శుక్రవారం శీలం రమణప్ప(40) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు వివరాల మేరకు.. గత కొన్నేళ్లుగా మద్యానికి బానిస కావడంతో ఆయన ఆరోగ్యం క్షీణించింది. అలాగే కడుపునొప్పి అధికం కావడంతో భార్య తులసి వైద్య చికిత్సలు చేయించింది. అయినా కడుపునొప్పి తగ్గకపోవడంతో విష రసాయనం తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు అతడిని అనంతపురం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట నరసింహ తెలిపారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి



గుత్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు



తాడిపత్రిలో ర్యాలీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి, విద్యార్థులు



పామిడిలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు



పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడులో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

గుత్తి/పామిడి/పెద్దవడుగూరు/తాడిపత్రి రూరల్: జమ్ము కాశ్మీర్ రాష్ట్రంలోని పహల్గాంలో అమాయకుల ప్రాణాలను బలి తీసుకున్న ఉగ్రవాదులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. గుత్తిలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయం వద్ద నుంచి ప్రభుత్వాసుపత్రి, గాంధీ సర్కిల్, బస్టాండ్ మీదగా రాయల్ సర్కిల్ వరకు అటు నుంచి గాంధీ సర్కిల్ వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. భారత్ మాతాకీ జై , ఉగ్రవాదం నశించాలి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఇన్‌చార్జ్ ప్రెసిడెంట్ పీడీ రత్నం, ప్రధాన కార్యదర్శి నగదాని చంద్రశేఖర్, సీనియర్ న్యాయవాదులు ఇస్మాయిల్, సుబ్బు, ఆర్‌వీ చలపతి, మనోహర్‌బాబు, రసూల్, తిమ్మారెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, రాం మోహన్‌రెడ్డి, నరసింహులు, సుధీర్‌రెడ్డి, దనుంజయ తదితరులు పాల్గొన్నారు.

- పామిడిలో కాశ్మీర్ పెహల్గాం ఘటనపై శుక్రవారం సవాజు అనంతరం ముతువలి బీకే రహీమ్ ఆధ్వర్యంలో జమాత్ సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అంతకుముందు ఈ ఘటనపై నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. తీవ్రవాదుల చేతిలో మృతి చెందిన 28 మంది ఆత్మశాంతి కోసం ప్రత్యేకంగా ప్రార్థించారు. తీవ్రవాదులను తక్షణం కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు, చెన్నవరం జాకీర్‌హుశేన్, నల్లభాదర్ మహమ్మద్, ఖాజామోహిద్దీన్, ఆఫ్రిది, యాడికి షెక్షా, హిదయతుల్లా, రషీద్, జమాత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.
- పెద్దవడుగూరు మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వెంకట్రాముడు, ఎద్దుల సూర్యనరాయణరెడ్డి, పోలా రంగస్వామి, ఆదినారాయణ, అల్లాబకాస్, ముత్యాలరెడ్డి, ఆదిరంగారెడ్డి, బద్రీ రామాంజనేయులు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.
- తాడిపత్రి పట్టణంలో పహల్గావ్ ఉగ్రదాడికి నిరసనగా శుక్రవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్ విద్యాసంస్థల చైర్మన్ రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ప్ల కార్డులను చేత పట్టుకుని ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమండ్ చేస్తూ విద్యార్థులు నినాదాలు చేశారు. రమేష్‌రెడ్డి మాట్లాడుతూ ఉగ్ర మూకలను ఏరివేయడంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

పారిశుధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి పెట్టండి

తాడిపత్రి రూరల్: పట్టణంలో పారిశుధ్యంపై మునిసిపల్ శానిటరీ విభాగం, సచివాలయ సిబ్బంది దృష్టి పెట్టాలని కమిషనర్ శివరామక్రిష్ణ సూచించారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం శానిటరీ విభాగం, సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. పట్టణంలో ఎక్కడా చెత్త చెదారం కనిపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తే చర్యలు, జరిమానాలు తప్పవని వ్యాపారులకు తెలియజేయాలన్నారు. ప్రతి రోజూ చెత్త సేకరణ వాహనాలు వస్తాయని అందులో మాత్రమే చెత్తను వేయాలని ప్రజలకు సూచించాలన్నారు. పట్టణం పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కమిషనర్ సూచించారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

యల్లనూరు: మండలంలోని మల్లాగుండ్ల గ్రామ సమీపంలో చిత్రావతి నది ఒడ్డున మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఎద్దు మునీంద్ర అనే వ్యక్తి అదుపులోకి తీసుకున్నామని శుక్రవారం ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ మద్యం అమ్ముతున్నారని సమాచారం రావడంతో దాడులు చేసి 12 క్వార్టర్ బాటిళ్ల స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.